సాక్షి కర్నూలు

ఆదివారం • 25 • ఫిబ్రవరి • 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి తిరువూరుకు చెందిన నల్లనాగ వెంకట్ దంపతులు రూ.1,00,006 విరాళాన్ని అందజేశారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్య కళావేదికపై శనివారం అనంతపురానికి చెందిన వాసవీ నృత్యాలయం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



అహోబిలేశుడికి స్వాగతం

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా అహోబిలేశుడి పల్లకీ శనివారం రుద్రవరం కేజీబీవీ ప్రాంగణంలోని తెలుపు మీదకు చేరుకుంది. గ్రామపెద్దలు పల్లకీకి ఘన స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

హన్వాళ్‌ను దాటిన ఎల్లెల్సీ నీరు



హొళగుంద సెక్షన్‌లో ప్రవాహం

హొళగుంద: తుంగభద్ర డ్యాం నుంచి దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు విడుదల చేసిన నీరు శనివారం హన్వాళ్ సెక్షన్(250 కి.మీ)ను దాటి వెళ్లాయి. తాగునీటి అవసరాల కోసం ఈ నెల 19న టీబీ బోర్డు అధికారులు ఎల్లెల్సీకి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. రోజు 480 క్యూసెక్కుల చొప్పున మార్చి 10వ తేదీ వరకు నీటి సరఫరా కొనసాగనుంది. కాలువలో గంటకు రెండు కిలోమీటర్ల వేగంతో నీరు ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం టీబీ డ్యాంలో 8.959(పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు) టీఎంసీల నీరు నిల్వ ఉంది. హొళగుంద(183 కి.మీ) వద్ద ఎల్లెల్సీలో 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది.

ఈవీఎంల ర్యాండమైజేషన్‌పై అవగాహన

కర్నూలు(సెంట్రల్): ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. ఈవీఎంల ర్యాండమైజేషన్ ఈఎంఎస్ వెబ్‌సైట్‌లో చేయాలన్నారు. దీని ద్వారా మొదటి విడత ప్రక్రియ పూర్తవుతుందన్నారు. రెండో విడత నియోజకవర్గస్థాయిలో అబ్జర్వర్, ఆర్‌ఓ, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలు రామలక్ష్మి, ఎం.శేషిరెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రేపు స్పందన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

శనగల కొనుగోలుకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో పండించిన శనగలను మద్దతు ధరతో అమ్ముకునేందుకు రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గద్వాల రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకొని, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. శనగకు మద్దతు ధర రూ.5,440 ఉందని తెలిపారు. మార్కెట్‌లో ధరలు తగ్గినపుడు రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం ఆర్‌బీకేల వారిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. శనగలను మద్దతు ధరతో కనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్ https://rayalaseemauniversity.ac.in అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రెండో సెమిస్టర్‌కు 1,132 మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా అందులో 262 మంది, నాల్గో సెమిస్టర్‌కు 2,717 మంది దరఖాస్తు చేసుకోగా 620 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

తొలి సెగ!



తెలుగుదేశం పార్టీ తొలి విడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితా అసంతృప్తి రగిల్చింది. తమ్ముళ్ల రాజీనామాలతో గందరగోళం నెలకొంది. నిన్న మొన్నటి వరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటనతో చలి కాచుకున్న టీడీపీ.. ఇప్పుడు ఆ పార్టీ విషయానికొచ్చే సరికి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అసంతృప్తులు పార్టీ అధిష్టానంపై విరుచుకుపడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడింది. ఉమ్మడి జిల్లాలో శనివారం ఆ పార్టీ తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ ప్రకటనతో కొన్ని నియోజకవర్గాల్లో నిరసనలు పెల్లుబుకగా.. చంద్రబాబు తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీ జెండాను మోసిన వారిని కాదని, ముక్కూ మొహం తెలియని వారికి టిక్కెట్లు కట్టబెట్టారని.. నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచారని నిరసన గళం వినిపిస్తుండటం గమనార్హం. ఇక తొలి జాబితాలో పేర్లు లేని నాయకులలోనూ అయోమయం నెలకొంది. తమకు కూడా వెన్నుపోటు తప్పదనే అభిప్రాయం ఆ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అదే జరిగితే రాజీనామాకు కూడా వెనుకాడేది లేదని తెగేసి చెబుతున్నారు.

అభ్యర్థుల ప్రకటనతో నిరసన గళం

- కొన్ని నియోజకవర్గాల్లో రాజీనామాల పర్వం
- డోన్‌లో ధర్మవరంను కాదని కోట్లకు సీటు
- ఆళ్లగడ్డలో దిక్కుతోచని ఇరిగెల రాంపుల్లారెడ్డి
- ఆలూరు సీటుపై కోట్ల సుజాతమ్మ ఆశలు వదులుకున్నట్లే..
- ఆదోని సీటుపైనా జనసేన పట్టు
- మీనాక్షినాయుడు ఆశలపై నీళ్లు చల్లనున్న అధిష్టానం
- మిగిలిన ఐదు చోట్లా వెన్నుపోటు తప్పదనే చర్చ

సాక్షి ప్రతినిధి కర్నూలు: కర్నూలు జిల్లాలో మూడు, నంద్యాల జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు టీడీపీ అధినేత చంద్రబాబు అభ్యర్థులను ప్రకటించారు. కర్నూలు, పత్తికొండ, కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థులుగా టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరిని నిర్ణయించారు. నంద్యాల జిల్లాలో నందికొట్కూరు మినహా తక్కిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, బనగానపల్లి, పాణ్యం, నంద్యాల స్థానాలకు ప్రస్తుత ఇన్‌చార్జ్‌లుగా ఉన్న భూమా అఖిల ప్రియ, బుడ్డా రాజశేఖరరెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి, గౌరు చరిత, ఎన్‌ఎండీ ఫరూక్‌ను కొనసాగించారు. డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని ఖరారు రేశారు. ఇక్కడి నుంచి ధర్మవరం సుబ్బారెడ్డి పోటీ చేస్తారని స్వయంగా చంద్రబాబు రెండుసార్లు ప్రకటన చేశారు. చివరకు ప్రకాశ్‌రెడ్డిని తెరపైకి తీసుకొచ్చారు. దీంతో చంద్రబాబు చెప్పిన ఏ మాటపై నిలబడే తత్వం లేదని, ఆయన మాటలకు, చేతలకు పొంతన లేదని ధర్మవరం సుబ్బారెడ్డి వర్గీయులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన సుబ్బారెడ్డి.. మరో రెండు రోజుల్లో తన కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

కేఈ ప్రభాకర్ పరిస్థితి ఏంటో?

చంద్రబాబు ప్రకటన తర్వాత డోన్ నుంచి కేఈ కుటుంబం కచ్చితంగా బరిలో ఉంటుందని కేఈ ప్రభాకర్ తేల్చిచెప్పారు. అందుకు అనుగుణంగా డోన్‌లో చురుగ్గా తిరుగుతూ పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. తనకు ఆర్థిక స్తోమత, రాజకీయం చేసే శక్తి ఉన్నాయని చెబుతూ టిక్కెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతాననే సంకేతాలను పరోక్షంగా పార్టీకి పంపారు. మరి ఇప్పుడు కేఈ ప్రభాకర్ ఏ నిర్ణయం తీసుకుంటారు? ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతారా? లేదా పార్టీ వీడుతారా? లేదంటే సర్దుకుని సైకిల్‌పైనే ఉండిపోతారా? అనేది వేచి చూడాలి.

ఆ ఐదుగురికి టిక్కెట్ లేనట్టేనా!

టిక్కెట్ ప్రకటించని ఐదు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల్లోనూ టెన్షన్ నెలకొంది. 9 స్థానాలు ప్రకటించి, తమను విస్మరించారంటే మార్పులు తప్పవనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

- ➤ కోట్ల కుటుంబానికి డోన్ ఇవ్వడంతో ఆలూరు నుంచి సుజాతమ్మకు టిక్కెట్ లేనట్టేననే చర్చ ఉంది. ఇక్కడి నుంచి బోయ వర్గానికి చెందిన ఓ డీఎస్పీని బరిలోకి దింపాలని టీడీపీ భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు వీరభద్రగౌడ్ పేరు కూడా పరిశీలనలో ఉంది. సుజాతమ్మకు టిక్కెట్ ఇచ్చే ఆలోచనలో ఉంటే తొలి జాబితాలోనే పేరు వచ్చేదని, రాలేదంటే ఆమెను పక్కన పెట్టినట్లేననే గుసగుసలు వినిపిస్తున్నాయి.
- ➤ ఎమ్మిగనూరులో జయనాగేశ్వరరెడ్డి పరిస్థితి కూడా ఇదే. అక్కడ చేనేత వర్గానికి చెందిన వ్యక్తికి టిక్కెట్ ఇవ్వాలనే యోచనలో టీడీపీ ఉండటంతోనే ఇక్కడా అభ్యర్థిని ప్రకటించలేదని తెలుస్తోంది.
- ➤ మంత్రాలయంలో కూడా బీసీ అభ్యర్థిని బరిలో నిలిపే యోచనతోనే తిక్కారెడ్డి పేరు ప్రకటించలేదని సమాచారం.
- ➤ జిల్లాలో ఒక్క స్థానమైన తమకు ఇవ్వాలని ఆదోని సీటును జనసేన గట్టిగా పట్టుబట్టింది. ఇక్కడి నుంచి నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను బరిలోకి దించే యోచనలో ఉంది.
- ➤ ఇక నందికొట్కూరు అభ్యర్థిని కూడా పార్టీ ఖరారు చేయాల్సి ఉండటం నేతలను అయోమయానికి గురిచేస్తోంది.

కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అసంతృప్తి

కోడుమూరు అభ్యర్థి ప్రకటనలో తన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా దస్తగిరిని ప్రకటించడంపై సూర్యప్రకాశ్‌రెడ్డి అసంతృప్తితో ఉన్నట్లు టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. దస్తగిరిని ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సిఫార్సు చేశారు. దీంతో పార్టీ వర్గాలతో ప్రకాశ్‌రెడ్డి మాట్లాడి, కోడుమూరు అభ్యర్థి ప్రకటనపై మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, తనకు తెలీకుండా దస్తగిరిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించినట్లు తెలుస్తోంది.



రాంపుల్లారెడ్డిలో నైరాశ్యం

పొత్తులో భాగంగా జనసేన టిక్కెట్ తనకే వస్తుందనే ఆశతో ఇరిగెల రాంపుల్లారెడ్డి జనసేనలో చేరారు. నియోజకవర్గంలో పర్యటనలు చేసి కచ్చితంగా తనకే టిక్కెట్టు వస్తుందని తన వర్గీయులతో చెప్పుకున్నారు. తీరా అఖిలకు టిక్కెట్ ఇవ్వడంతో ఆయనలో నైరాశ్యం నెలకొంది. చివరకు టీడీపీ సభలకు కూడా రాంపుల్లారెడ్డిని అఖిల ఆహ్వానించకపోవడం, అతని సహకారం తనకు అవసరం లేదనే రీతిలో ఆమె వ్యవహారం ఉండటంతో రాంపుల్లారెడ్డి భవిష్యత్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మార్చకపోతే రాజీనామాలే..

కోడుమూరు అభ్యర్థిగా బొగ్గు దస్తగిరిని ప్రకటించడంపై ఆకేపోగు ప్రభాకర్ స్పందించారు. 30 ఏళ్లుగా పార్టీ కోసం శ్రమిస్తున్నాని, ప్రతీసారి ఐదేళ్ల తనతో పని చేయించుకుని తీరా టిక్కెట్ మరొకరికి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీనే నమ్ముకున్న వారికి ఇదేనా బహుమానం అని చంద్రబాబునే ప్రశ్నించారు. 53 రోజులు చంద్రబాబు జైలుకు వెళితే దీక్షలు, నిరసనలు తాము చేశానని, ఇన్నేళ్లుగా పార్టీకోసం పనిచేసి ఆర్థికంగా చితికిపోయామని, చివరకు పార్టీలో సభ్యత్వంలేని అనామకున్ని అభ్యర్థిగా ప్రకటించి చంద్రబాబు తమను నట్టేట ముంచాడన్నారు. అభ్యర్థిని మార్చకపోతే తాము రాజీనామా చేయడంతో పాటు తాను, తన భార్య, పిల్లల శవాలపై ప్రచారం చేసుకోవాలని, తాము విషం తాగి చనిపోతామని బోరున విలపించారు. చంద్రబాబు ప్రకటనపై కోడుమూరు, గూడూరు, బెళగల్, కర్నూలు మండలాల టీడీపీ కన్వీనర్లు కోట్ల కవితమ్మ, సుధాకర్‌రెడ్డి, గజేంద్రగౌడ్, శివశంకర్‌నాయుడు పార్టీకి రాజీనామా చేశారు. అలాగే 10 మంది క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, 58మంది యూనిట్ ఇన్‌చార్జ్‌లు, 275 మంది బూత్ కన్వీనర్లు రాజీనామా చేయడం గమనార్హం.





ప్రమాణ స్వీకారం

శనివారం కర్నూలులోని లోకాయుక్త కార్యాలయంలో ఉపలోకాయుక్తగా పగిడి రజనితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

28న వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులు విడుదల

- 76,851 మంది రైతులకు ప్రయోజనం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నలకు మరో ఉపశమనం కలిగిస్తోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.18.21 కోట్లు విడుదల కానున్నాయి. 76,851 మంది రైతులకు ప్రయోజనం లభిస్తోంది. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకొని, గడువులోపు అసలు, వడ్డీ చెల్లించిన పంట రుణాలకు 4 శాతం వడ్డీని ప్రభుత్వం వెనక్కి చెల్లిస్తుంది. 2021-22 రబీ సీజన్‌కు సంబంధించి 17,142 మంది రైతులకు రూ.3,19,98,374 రీయింబర్స్ చేస్తోంది. 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 59,709 మంది రైతులకు రూ.15,01,56,339 వడ్డీ వెనక్కి చెల్లించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు వడ్డీ నిధులు విడుదల చేస్తారని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు గ్రూప్-2 ప్రిలిమినరీ ప్రవేశ పరీక్ష



ఎమ్మిగనూరులో పరీక్షకు సిద్ధం చేసిన హాలు

కర్నూలు(సెంట్రల్): గ్రూప్-2 ప్రిలిమినరీ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఈ పరీక్ష ద్వారా 889 పోస్టులను భర్తీ చేయనుండటంతో పోటీ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలోనే విశాఖపట్నం తరువాత కర్నూలు జిల్లాలో అత్యధికంగా 36 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధికారిగా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను నియమించారు. జిల్లా కేంద్రంతో పాటు కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోనిలో మొత్తం126 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. అయితే అభ్యర్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రంలోకి 10.15 గంటల నుంచే అనుమతిస్తారు. 10.30 గంటల తర్వాత లోపలికి అనుమతించరు.

మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలే...

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షపై ఏపీపీఎస్సీ డేగ కన్ను వేసింది. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి విజయవాడలోని ఏపీపీఎస్సీ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించనున్నది. అభ్యర్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడినా, పరీక్ష నిబంధనలను ఉల్లంఘించినా దీర్ఘకాలం ఏపీపీఎస్సీ పరీక్షలు రాయకుండా వేటు వేయనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఇందు కోసం 378 మంది పోలీసులు పహారా కాస్తారు. జిల్లాలోని ప్రతి పరీక్ష కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

గ్రూప్-2 పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. సందేహాలు, సలహాలకు 8886884766, 8142460214, 08518-277305 నంబర్లను సంప్రదించవచ్చు. పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

అన్ని ఏర్పాట్లు చేశాం

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాల వాడకంపై నిషేధం విధించాం. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేలా ఆదేశించాం.

– నారపురెడ్డి మౌర్య, జిల్లా కోఆర్డినేషన్ అధికారి

మార్కెట్ ఫీజు వసూళ్లకు నాలుగు ప్రత్యేక టీమ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం పక్కదారి పట్టకుండా నాలుగు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తూ కడప మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాకు రెండు, నంద్యాల జిల్లాకు రెండు టీములు ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ టీమ్‌లు చెక్‌పోస్టులు, మార్కెట్ కమిటీలు, రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు తనిఖీలు చేపట్టి వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై మార్కెట్ ఫీజు చెల్లింపులను పరిశీలిస్తారు. ఉమ్మడి జిల్లాలో 15 మార్కెట్ కమిటీలు ఉండగా.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు మార్కెట్ ఫీజు వసూలు చేయాలనే లక్ష్యంతో ఈ టీమ్‌లు ఏర్పాటయ్యాయి.

- పత్తికొండ మార్కెట్ కమిటీ సెక్రటరీ కార్నలీస్ ఆధ్వర్యంలోని టీమ్ కర్నూలు, పత్తికొండ, కోడుమూరు మార్కెట్ కమిటీలను పర్యవేక్షిస్తుంది.
- ఆదోని మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ ఆధ్వర్యంలోని టీమ్ ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీల్లో తనిఖీలు చేపడుతుంది.
- డోన్ మార్కెట్ కమిటీ గ్రేడ్-2 సెక్రటరీ మాధవక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలోని టీమ్ పాణ్యం, బనగానపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు మార్కెట్ కమిటీల బాధ్యతలు చూస్తుంది.
- కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ సెక్రటరీ జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలోని టీమ్ నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ, కోవెలకుంట్లలో తనిఖీలు చేపడుతుంది.



భక్తజనం మధ్య రథోత్సవ దృశ్యం

వైభవంగా మద్దమాంబ రథోత్సవం

మద్దికెర: మద్దమాంబ రథోత్సవం శనివారం మద్దికెరలో అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, విశేషపూజలు నిర్వహించారు. పెద్దనగరి, చిన్ననగరి యాదవ కుటుంబీకులు సంప్రదాయాన్ని పాటిస్తూ ప్రత్యేక దుస్తులతో ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా దేవాలయానికి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు ఊరేగింపుగా రథం వద్దకు తీసుకెళ్లారు. అమ్మవారిని రథంలో అధిష్టింపజేసి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మద్దమాంబకు జై అంటూ భక్తులు రథాన్ని ముందుకు లాగారు. రథం పైకి అరటిపండ్లను విసిరి భక్తిభావాన్ని చాటుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పూజలందుకుంటున్న మద్దమాంబ అమ్మవారి మూలవిరాట్

క్లుప్తంగా

గుండ్రేవులలో అక్రమ క్వారీ

- క్రషర్, ఒక టిప్పర్ సీజ్



అక్రమ క్వారీని తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): సి బెళగల్ మండలం గుండ్రేవుల సమీపంలో అక్రమ క్వారీ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శనివారం విలేకరులకు తెలిపారు. ఎ. రాంభూపాల్, ఎ. ప్రభాకర్ అనే వ్యక్తులు పలు కుదొడ్డి, గుండ్రేవుల గ్రామాల్లోని సర్వే నంబర్ 457, 240లో అక్రమ క్వారీ, క్రషర్ నిర్వహిస్తున్నారని తనిఖీల్లో తేలిందన్నారు. దీంతో క్రషర్‌ను, రోడ్డు మెటల్ తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసి సి బెళగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమంగా క్వారీ నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నట్లు చెప్పారు.

కుక్కకాటుతో బాలుడి మృతి



అష్రఫ్ అలీ (ఫైల్)

వెలుగోడు: కుక్కకాటుకు ఐదేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన వెలుగోడు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. 10వ వార్డుకు చెందిన హుస్సేన్ బాషా కుమారుడు అష్రఫ్ అలీ గత నెల 29వ తేదీ బయట ఆడుకుంటుండగా వీధి కుక్క కాటు వేసింది. దీంతో అతన్ని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా కోలుకోలేక శనివారం మరణించాడు.

సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో శనివారం పౌర్ణమి సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా కొలనుభారతి దేవి అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించి విశేష పూజా కార్యక్రమాలు చేసుకొన్నారు. అక్కడే ఉన్న సప్తశివాలయాల్లోని దేవతామూర్తులను భక్తితో మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం ఆలయ పురోహితుడు శ్రీనివాసశర్మ చిన్నారులతో బియ్యంలో బీజాక్షరాలు దిద్దించి, పలక బలపం పట్టించి 'ఓం సరస్వతి నమస్తుభ్యం' అని రాయించి అక్షరాభ్యాసాలు చేశారు.

చెక్‌పోస్టులు మరింత బలోపేతం

- సెబ్ నేర విభాగం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



సమీక్ష నిర్వహిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య

కర్నూలు (టౌన్): రానున్న ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేస్తున్నట్లు సెబ్ నేర విభాగం డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య తెలిపారు. శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం సెబ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలో ఇప్పటివరకు నాటుసారా విక్రయదారులపై 223 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా 198 మందిని అదుపులోకి తీసుకున్నామని, అందులో 31 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 20 కేసుల్లో రూ.2 లక్షలు జరిమానాను ప్రభుత్వ ఖజానాకు చెల్లించినట్లు చెప్పారు. నాగులదిన్నె, మాదవరం చెక్‌పోస్టులలో మరి కొంతమంది అధికారులను నియమించాలని, ఆకస్మిక తనిఖీలు నిరంతరం చేపట్టాలన్నారు. అంతకుముందు డిప్యూటీ కమిషనర్ పంచలింగాల చెక్‌పోస్టు వద్ద డాగ్ స్క్వాడ్‌తో స్వయంగా తనిఖీలు నిర్వహించారు. సుంకేసుల చెక్‌పోస్టును తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సెబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేడు కూడా కరెంట్ బిల్లులు చెల్లించవచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదివారం సెలవు అయినప్పటికీ కరెంటు బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి వినియోగదారులకు సూచించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కరెంటు బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం పూర్తి స్థాయిలో పని చేస్తాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

నంద్యాల(అర్బన్): విద్యుత్ చౌర్యాన్ని అరికట్టి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ డీపీఈ ఎస్‌ఈ శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాల కారకాలపై శనివారం స్థానిక డీ3 సెక్షన్ కార్యాలయంలో డీఈఈ, ఏఈ, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు డీ3 సెక్షన్‌కు సంబంధించి మున్సిపాలిటీ, ఎస్పార్బీసీ, బొమ్మలసత్రం, బొగ్గులైన్, క్రాంతినగర్ ఫీడర్లను ఆయన పరిశీలించారు. అదే విధంగా 2020 కేవీ నంద్యాల సబ్‌స్టేషన్‌లో ఉన్న హైలాసెస్ 132 కేవీ రైల్వే ఫీడర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టాలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యం తనిఖీల్లో 73 కేసులు నమోదు చేసి రూ.1.52 లక్షల జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ శ్రీనివాసరావు

దొంగ దొరికాడు



దొంగ అరెస్ట్‌ను చూపుతున్న సీఐ ప్రసాదరావు

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతనికి సహకరిస్తున్న ఓ బాలుడిని కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాదరావు, వన్ టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఘంటామఠం వద్ద నివాసముంటున్న ఆటో డ్రైవర్ పగడాల శివ దాదాపు రెండేళ్లుగా శ్రీశైల క్షేత్ర పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నాడు. మట్కా, జూదం, జల్సాలకు అలవాటు పడిన శివ చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం దేవస్థానంలో పని చేసే ఉద్యోగి జి.మల్లికార్జున ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాదరావు, వన్ టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టగా ఆటో డ్రైవర్ పగడాల శివ చోరీ సొమ్ముతో మట్కా ఆడుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు శనివారం హాటకేశ్వరం వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతనికి సహకరించిన అదే ప్రాంతానికి చెందిన బాలుడిని కూడా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.1.35 లక్షలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకున్నామన్నారు. అలాగే తనకు వ్యతిరేకంగా ఉన్న వారికి సంబంధించిన రెండు బైక్‌లకు రాత్రి సమయంలో నిప్పు పెట్టి దగ్ధం చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు.

పత్తికొండలో వరుస చోరీలు

- బెంబేలెత్తుతున్న జనం



ఐడీఎఫ్‌సీ ఏటీఎం కస్టమర్ సర్వీస్ పాయింట్ షట్టర్ పగులగొట్టిన దృశ్యం

పత్తికొండ రూరల్: పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈనెల 20వతేదీన పత్తికొండలోని సవారమ్మ కాలనీలో నివాసం ఉంటున్న సచివాలయం ఏఎన్‌ఎం అనసూయమ్మ ఇంట్లో 12తులాల బంగారు, రూ.50వేల నగదు చోరీకి గురయ్యాయి. రెండురోజుల క్రితం పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలోకి ముసుగు దొంగలు ప్రవేశించి స్వామివారి ఆభరణాలైన భారీగా ఇత్తడి వస్తువులను ఎత్తుకెళ్లారు. శుక్రవారం పట్టణంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పబ్లిక్ రీడింగ్‌రూం కాంప్లెక్స్‌లో ఉన్న ఐడీఎఫ్‌సీ ప్రైవేటు ఏటీఎం కస్టమర్ సర్వీస్‌పాయింట్, భగవాన్ సెల్‌షాపు, మెడికల్ షాపు, సెలూన్ షట్టర్లకు వేసి ఉన్న తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఐడీఎఫ్‌సీ సర్వీస్ పాయింట్‌లో వినియోగదారుల కోసం ఉంచిన రూ.60వేలు చోరీకి గురైనట్లు బాధితుడు ఇస్మాయిల్ తెలిపాడు. భగవాన్ సెల్ షాపులో నాలుగు సెల్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు 40వేల వరకు ఉంటుందని షేక్ సుబాన్ బాషా తెలిపాడు. దీంతో పాటు మెడికల్ షాపు, స్టేట్‌బ్యాంకు సమీపంలోని సెలూన్‌లో కూడా చోరీకి యత్నించారు. అక్కడే ఉన్న కిరాణం షాపులోకి వెళ్లేందుకు షటర్ పెకిలించేందుకు ప్రయత్నించారు. ఉదయాన్నే విషయం తెలుసుకున్న షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

- 3,600 లీటర్ల బెల్లంఊట ధ్వంసం
- 100 లీటర్ల సారా, 250 కిలోల బెల్లం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా బిందెలతో పోలీసులు

ఓర్వకల్లు/కర్నూలు (టౌన్): నాటు సారా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కర్నూలు స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఇంచార్జి అదనపు ఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఉదయం మండలంలోని గుడుంబాయి తండాలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గుడుంబాయి తండా నుంచి ఇతర ప్రాంతాలకు సారాను సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సెబ్ పోలీసులు, స్థానిక ఎస్‌ఐ రాజారెడ్డి, పోలీసుల బృందం ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సారా తయారీకి ఉపయోగించే 3,600 లీటర్ల సారా ఊట బెల్లంను ధ్వంసం చేశారు. మరో 100 లీటర్ల నాటు సారా, 250 కిలోల బెల్లంను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. దాడుల్లో సెబ్ అధికారి వినోద్ కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి ఆసుపత్రిలో.. తండ్రి మద్యం మత్తులో!

- భిక్షాటనకు వెళ్తున్న నలుగురు చిన్నారులు శిశుగృహకు తరలింపు



శిశు గృహకు చేరిన నలుగురు చిన్నారులు

కర్నూలు(అర్బన్): తల్లి అనారోగ్యంతో స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతుండడం, తండ్రి మద్యానికి బానిసై పట్టించుకోక పోవడంతో వారి సంతానమైన నలుగురు చిన్నారులను శిశు గృహకు తీసుకువెళ్లారు. ఇందుకు సంబంధించిన వివరాలు ... గూడూరుకు చెందిన ఓ వ్యక్తి నిత్యం మద్యం సేవించి భార్యను హింసిస్తున్నాడు. దీంతో ఆమె తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో పది రోజుల క్రితం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మద్యానికి బానిసైన తండ్రి తన నలుగురు చిన్నారులను భిక్షాటనకు పంపిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ తెలిపారు. తండ్రిని ఒప్పించి తమ సిబ్బంది ద్వారా నలుగురు చిన్నారులను చేరదీసి శిశు గృహకు పంపించామన్నారు. ఈ సమాచారాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అందించామని, ఈ నెల 26న సీడబ్ల్యూసీ అధికారులు పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటారన్నారు. తండ్రి దగ్గర చిన్నారులకు రక్షణ ఉండదని, శిశు గృహలోనే చిన్నారులకు ఆశ్రయం ఇవ్వాలని సీడబ్ల్యూసీ తెలియజేస్తే వారిని శిశు గృహలోనే ఉంచుకుంటామని వెంకటలక్షుమ్మ తెలిపారు.

క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం



చాకలి రాజేశ్వరి మృతదేహం

ఎమ్మిగనూరురూరల్: భర్త తాగుడు మానడం లేదని క్షణికావేశానికిలోనై ఇంట్లో ఉరివేసుకొని చాకలి రాజేశ్వరి(21) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఎమ్మిగనూరు పట్టణం ముగతిపేటలో నివాసముంటున్న చాకలి రాజుకు కొండమీద ప్రాంతానికి చెందిన చాకలి రాజేశ్వరితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. చాకలి రాజు అప్పుడప్పుడు మద్యం సేవిస్తుండేవాడు. మద్యం మానేయ్యాలని భార్య గొడవపడేది. ఈ విషయమై శనివారం ఉదయం భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లగా క్షణికావేశంలో చాకలి రాజేశ్వరి ఇంట్లో రేకుల షెడ్ ఇనుపపైపుకు తాడుతో ఉరివేసుకుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన రాజు.. భార్య ఉరివేసుకుని ఉండటాన్ని చూసి కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి రాజేశ్వరిని ఉరి నుంచి కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య మృతి చెందటంతో భర్త రాజు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలు తల్లి చాకలి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ మధుసూదన్‌రావు తెలిపారు.

అల్లుడే దొంగ!

- దొంగతనం కేసును ఛేదించిన ఆదోని పోలీసులు



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసును త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. అల్లుడే ఇంటి దొంగ అని తేల్చారు. శనివారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలను మీడియాకు చూపించారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన షాహీక్‌కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హీనా, చిన్నకుమార్తె షాహీనా, పెద్ద కుమార్తె హీనా మహారాష్ట్రలోని హుస్నాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్‌ఇషాక్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. చిన్న కుమార్తె అయిన షాహీనాకు అప్పుడప్పుడు బంగారు, డబ్బులను తల్లి షాహీన్ ఇచ్చేది. పెద్ద అల్లుడు సయ్యద్‌ఇషాక్ అడిగినా కూడా ఇవ్వకుండా ఉండేది. ఈ నెల 22న అత్త ఇంటికెళ్లి తాళాన్ని పగలగొట్టి, బీరువాను పగలగొట్టి కొంత బంగారం, వెండి ఆభరణాలు, నగదు దొంగలించాడు. అత్త షామీన్ ఈనెల 22న ఫిర్యాదు మేరకు దొంగతనం కేసు నమోదు చేసుకున్న త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టగా, అల్లుడే ఇంటి దొంగ అని తేలింది. సయ్యద్ ఇషాక్ పట్టణంలోని రిలయన్స్ ట్రెండ్స్ వద్ద తిరుగుతున్నాడని తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకొని, అతని వద్ద ఉన్న ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాల విలువ రూ.4.80 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. రెండు రోజుల్లో దొంగతనం కేసును ఛేదించినందుకు డీఎస్పీ శివనారాయణస్వామి పోలీసులను అభినందించారు.